మూన్ ఈటర్

మొదటి ఆట సినిమా చూసి పాతిక మఫ్ఫైమంది ఇంజనీరింగ్ విద్యార్థులు జట్లుజట్లుగా నడుస్తూ చూసిన సినిమాలో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ పాటలు పాడుకుంటూ వస్తున్నారు, ''సాహు'' టీ దుకాణం దగ్గరికి వచ్చేసరికి సడన్‌బ్రేక్ వేసినట్టు వాళ్ళ కాళ్ళు ఆగిపోయాయి. వాళ్ళ గోలమధ్య కూడా స్పష్టఃగా వూరుచివర ''గురువారీ'' కేకలకి అందరూ ఒక్కసారి నిశబ్దం అయిపోయారు.

''బాబోయ్ - అమ్మోయ్ - నాన్నోయ్'' అంటూ అరుస్తున్న గురువారీ కేకలు వింటూ అందరూ ఒక్కక్షణం తెల్లబోతూ నిలబడ్డారు. ఆ నిశబ్ధంలో గురువారీ ఏడుపు. వెక్కిళ్ళు. ''వదులు బాబో, వద్దుబాబూ'' అంటున్న మాటలు విన్నారు. ఆ వెంటనే సాహుబండగొంతు ''నోర్మూయ్ - ఎందుకలా అరుస్తావు'' అని గదమాయించడమూ వినిపించింది.

కొందరు విద్యార్థులు గబగబ అటు వెళ్ళారు. బాషసరిగా అర్థంకాని మూర్తి వెంకట్రావుని ''ఏమిటి?'' అని అడిగాడు ''గురువారీని ఆసాహు గాడు ఏదో చేస్తున్నట్లున్నాడు'' అంటూ వెంకట్రావూ పరిగెత్తాడు. అందరూ సాహుగుడిసె దగ్గరకి వెళ్ళి రేకులతలుపు బాదారు. లోపల ఒక్క సారిగా నిశ్శబ్దం అయింది.

''అరేయి, తీస్తున్నావా లేదా తలుపు తీయిముందు'' అంటూ వాళ్ళ గ్రూప్ లీడరు నిరంజన్ పాత్రో బూటుకాలితో తలుపులు తన్నాడు.

ఒక్కక్షణం తర్వాత తలుపుదగ్గర ''ఏటి బాబూ ఏం కావాలి'' అన్న సాహు గొంతు వినిపించింది.

''తలుపుతీయి ముందు'' అసహనంగా అరిచాడు శరత్ మిశ్రా. మరోక్షణం పోయాక తలుపు గడియతీసి తల బయటికి పెట్టి అందరిని ఆశ్చర్యంగా చూస్తూ ''ఏమిటిబాబూ యింతరాత్రికాడ వచ్చారు ఏం కావాలి?'' వాడి మాటలు వినకుండా ''ముందు తలుపుతీయి'' అని గద్దించాడు సంతోష్ నందా.

''ఏమిటిబాబూ రాత్రికాడ యీ గొడవ'' అంటున్న సాహుని తోసుకుని నిరంజన్, శరత్ లోపలికి వెళ్ళారు. వాళ్ళవెంట అందరూ లోపలికి జొరబడ్డారు. ''మనకెందుకు ఈ గొడవ వెళ్ళిపోదాం'' అన్నాడు మూర్తి వెంకట్రావుతో. మూర్తి కొత్తగా వచ్చాడు అంతా కొత్త. భాషరాదు – అన్నింటికి భయం.

''చాల్లే వెళ్లిపోదామా, పాపం గురువారిని యిలా వదలి'' అన్నాడు వెంకట్రావు – ఏమనలేక తనొక్కడూ వెళ్ళిపోతే అంతా ఏమంటారోనని మూర్తి జొరబడ్డాడు గుంపులో.

పాకలో మధ్యగా నులకమంచం వుంది. కుళ్ళు బొంత, కుళ్ళు దుప్పటి రేగి అడ్డదిడ్డంగా పడివున్నాయి. పాకలో ఓ రాటని కరుచుకుని పునోటినించి తప్పించుకని బయటపడిన చిన్న గోరంకలా వణికిపోతూ నిల్చుంది గురువారీ. ఆ పిల్ల వళ్ళంతా చెపట పట్టేసింది. తలంతా రేగివుంది. మొహం అంతా కందగడ్డలావుంది. భయంతో వణికిపోతూ వెక్కివెక్కి ఏడుస్తుంది.

ఆ వాతావరణం చూడగానే అందరికి సంగతి అర్థంఅయింది. లోపలికి తోసుకొచ్చిన అందరిని చూసి ''ఏమిటి బాబూ యిది'' అన్నాడు కోపంగాసాహు.

''ఏమిటూ, ఆ పిల్లనేం చేశావు, ఎందుకలా ఏడుస్తూంది గురువారీ?'' అన్నాడు నిరంజన్. సాహు మొహం సిగ్గుతోనో కోపంతోనో ఎర్రబడింది. కాస్త తడబడి సర్దుకుంటూ ''ఏదో మా గొడవ, మీకేం బాబూ'' అన్నాడు.

''నీ గొడవా, ఏమిటిరా నీగొడవ, ఆ పిల్ల ఎందుకలా కేకలు వేసింది ఎందుకలా భయపడ్తోంది, చెప్పు, ఏంచేశావు?'' అంటూ హుంకరించాడు సంతోష్.

గురువారి అందరిని చూసి ఏడుపు యింకా హెచ్చించింది. వెక్కుతూ ''వీడు... వీడు'' అంది.

''ఆ.. ఏంచేశాడు'' ఆరాటంగా అడిగారు కొందరు, గురువారీ ఏదో అనేలోపలే ''నోరుముయ్యి. లోపలికెళ్ళు ముందు'' అంటూ గుడ్లెర్రజేసి కసిరాడు సాహు.

"చెప్పు. ఫరవాలేదు, చెప్పు..." అన్నాడు నిరంజన్.

"ఆడు.. ఆడు.. దొంగసచ్చినోడు, నన్ను.. నన్ను..." బోరుమంది గురువారీ అంతకంటె చెప్పలేక.

ఈసారి పూర్తిగా అర్థమయింది. "ఏయ్ సాహు బుద్ధివుందా లేదా నీకు...." తీక్షణ,గా అంటూ మీదమీదకి వెళ్ళాడు శరత్. నడ్డిన చేతులుంచుకొని వీరుల్లా నిలబడి తనని దబాయిస్తున్న వాళ్ళందరిని చూసి ఒక్క క్షణం తెల్లమొఖం వేసి నాతరువాత బింకంగా "నాగొడవ మీ కెందుకు, దాన్నేం సేస్తే సేత్తాను, ఇది నా సొత్తు మీరేటి సెప్తారు నాకు" అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడు సాహు.

"అది నీ సొత్తా, దాని మొగుడి వేమిటిరా నీవు, దానికి తాలిగట్టావా?" అంటూ రెచ్చిపోయారు ముగ్గురు. తక్కినవాళ్ళు చోద్యం చూస్తూ నిలబడ్డారు.

'తాళేటి పెళ్ళేటి. అయన్నీ మీకు, మాకేటి, ఏం లేకపోతే రెండొందలిచ్చి దీన్ని మేపడానికా కొన్నాను."

"రెండొందలిచ్చి కొని, నెలంతా చాకిరి చేయించు కుంటునావు. అది చాలక యింకా పట్టుమని పదమూడేళ్ళు లేని పిల్లని నాశనం చేద్దామనుకున్నావా"

వాళ్ళ ఆరోపణలకి జవాబియ్యాల్సిన అవసరం లేనట్టు సాహు లుంగీ ఎత్తి కడ్తూ "ఎల్లండి బాబు, తీరికూకుని మీ కేల మాగోల - ఎల్లి సదూకోండి"

వాడి నిర్లక్ష్యానికి వాళ్ళందరికి పౌరుషం వచ్చింది. వాళ్ళని, స్టూడెంట్స్‌ని, అందులో ఇంజనీరింగ్ కాలేజీ స్టూడెంట్లని, ఓ టీ కొట్టు వెధవ గడ్డిపోచ చెయ్యనివాడు, వాళ్ళ దయా ధర్మం మీద బ్రతికేవాడు వాళ్ళకి దండాలు పెడ్తూ వాళ్ళ ప్రాపు కోసం ప్రాకులాడే వెధవ యీనాడు వాళ్ళని తీసి పారేస్తు మాట్లాడు తాడా! పొరపాటయింది క్షమించండి అనడానికి బదులుమీ కెందుకు నాగొడవ అనే దాకా వచ్చాడా? అన్యాయాలు ఎక్కడ జరిగినా ఎదుర్కోనడానికి ముందుండే వాళ్ళు ఈ నాడు ఓ పసిపిల్లకి జరిగే దురన్యాయాన్ని చూస్తూ వూరుకుంటారా!

"ఏమిట్రా కూస్తున్నావు వళ్ళు పొగరెక్కిందా? మర్యాదగా మాట్లాడటం తెలీదురా రాస్కెల్" సాహు పై గుడ్డ పట్టుకుని లాగుతూ అరిచాడు నిరంజన్.

సాహు అసలే తాగి వున్నాడు. దాంతోడు మంచి గ్రంథంలో వుండగా వచ్చి పాడుచేశారేమో వాడికి తిక్కరేగింది. నిరంజనే చేతినుంచి విసురుగా గుడ్డలాక్కుని "ఇదిగో మాటలు మీరకండి. బాబూ నే నెవరితో పడుకోడానికి మీ

పర్మిషన్ కావాలా నాకు, నాయిష్టం వచ్చిన లంజతో పడుకొంటాను. దొంగముండా. మళ్ళా నోరెత్తితే సంపేస్తాను. లంజకానా నిన్ను రెండొందలు పెట్టి కొన్నది తిని కూకోబెట్టుకోడాని కనుకొన్నావటే. ఊఁ ఆ అన్నావంటే యీసారి మక్కే లిరగతంతాను. సిగ్గునేదే - నో రెట్టివూరు వాళ్ళందరిని పిలుస్తావా'' అంటూ గరువారీ జుట్టు పట్టుకున్నడు వాళ్ళమీద చూపలేని కోపాన్ని గురువరీ మీదచూపించి దాని నడ్డివంచి నాలుగు గుద్దులు గుద్దాడు.

అంతే? అందరికి ఆవేశం వచ్చేసింది. ''ఏయ్, ముందాపిల్లను వదులు'' అంటూ శరత్ ముందుకు వురికి సాహు మెడ పట్టుకున్నడు. సాహు వెర్రి ఆవేశంతో ''ఎళ్ళండెహే, సూస్తున్నాను ఇందాకాడనించి, నాయింట్లోంచి పోతారా, తన్నమన్నారా, నానసలే మంచోడ్నిగాను, దాని గొడవ మీ కెందుకు'' అంటూ తాగిని కైపులో దాన్ని, వాళ్ళని కలిపి బండ బూతులు తిడుతూ అందరిని బయటికి నెట్టడానికి ప్రయత్నించాడు.

మీద మీదకి వచ్చి బలంగా తోస్తున్న సాహుని చాచిపెట్టి కొట్టాడు నిరంజన్. సాహు అంతదూరం తుళ్ళిపడ్డాడు. వెంటనే కోపంతో వడుకుతూ లేచి ''మిమ్మల్నేం చేస్తానో చూడండి'' అంటూ మీదకి వెళ్ళాడు.

''వరేయ్ చూస్తారేమిటిరా ఆ వెధవని కట్టేయండిరా'' అని అరిచాడు సంతోష్, నలుగురైదుగురు సాహుని కదలకుండా బంధించాడు మరి కొందరు తాడుకోసం వెదికారు తాడు కనపడక నులక మంచం తాడు పీకి సాహుని రాటకేసి కట్టేసారు. ''నీకింత పొగరెక్కిందిరా, మాకు ఎదురు తిరిగి బ్రతుకగలనను కున్నావా, మేం తలుచుకుంటే ఏం చెయ్య గలమో నీకు తెలియదురా'' అంటూ జుట్టు పట్టుకు ఎడా పెడా వాయించాడు పాత్రో.

''వదలండి దొంగ వెధవలారా'' అంటూ గింజుకుంటూ తిట్టాడు సాహు. 'నోర్ముయ్' మరో టంటించాడు నిరంజన్. 'మమ్మల్నే వెధవనే దాకా వచ్చావా. మా తిండి తింటూ మమ్మల్నే ఎదిరిస్తావా. నీవెంత నీ బ్రతుకెంత చూడు యింక యిక్క డెలా బ్రతుకుతావో చూపిస్తాం. వరే పచ్చడి చేయండిరా వెధవని.. ఊహు - వాడ్ని తంతే చస్తాడు, వాడు మళ్ళీ లేవకుండా చెయ్యాలి'' అంటూ యిటూ అటూ చూశాడు నిరంజన్, గాజు బీరువాలో నిన్నటి సింగడాలు మొన్నటి రసగుల్లాలు పొద్దుటి వడలు అన్నీ వ్నుయి. ఆ బీరువా పళంగా ఒక్కతోపు తోశాడు పెళ పెళమని అద్దాలువిరిగాయి. కప్పులు సాసరులు గాజు గ్లాసులు పెట్టిన టేబిల్ని తోసి క్రింద పడేశాడు. యింకా విరగకుండ మిగిలిన కప్పులని బూటుకాలితో పచ్చడి

చేశాడు. ఆ మాత్రం అందించాగానే మిగతా అందరికి ఉత్సాహం వచ్చేసింది మిగతా అందరూ ఉత్సాహంగా రంగంలోకి దుమికేశారు, యిలాంటి ఎడ్వెంచర్ అంటే అందరికి ఎంతో యిష్టం! సాహు త్రాగిన మత్తు దిగిపోయి భయంతో గడ్డకట్టిపోయాడు. గుడ్లప్పగించి చూడ్డం మినహా నోట మాట పెగల లేదు. సాహు నోట్లోంచి మాట వచ్చేలోగా హోటలులో వున కుర్చీలు బెంచీలు విరిగాయి. కప్పులు సాసర్లు పిప్పి అయ్యాయి. నులక మంచం కాళ్ళూడాయి. గుడ్డలు పీలికలయ్యాయి. పాక తాటాకులు ఎగిరి పోయాయి.

సాహు తేరుకుని కేకలు పెట్టేసరికి అప్పటికే యీ గలాభాకి ఇరుగు పొరుగు గుడిసె వాళ్ళు చేరి భయం భయంగా చుట్టూ చేరి చూడ్డంమినహా ఏమీ చేయలేక పోయారు. వాళ్లంతా మాట్లాడటానికి నోరు తెరిచేసరికి జరగాల్సింది అంతా జరిగిపోయింది. గురువారీ మరింత భయంతో బిక్కచచ్చిపోయి గోడకి కరుచుకుని మూల వుండిపోయింది. గురువారీ కంటే భయంగా మూర్తి ఓ మూల నించున్నాడు, అంతా చూస్తూ.

అంతా అయ్యాక నిరంజన్ ఠీవిగా చేతులు దులుపుకుని జేబులోంచి రుమాలు తీసి మొహం తుడుచుకుంటూ ''ఏం సాహు, మళ్ళీ ఆ పిల్ల మీద చెయ్యి వేస్తావా, మేం అంటే ఏమిటో తెలిసిందా? మళ్ళీ ఆపిల్ల జోలికి వెడితే ప్రాణం తీసేస్తాం! యీ సారి'' అన్నాడు. సాహు చూపులకే శక్తి వుంటే వాళ్ళని మాడ్చేసి వుండేవి ఆ చూపులు ''బుద్ధిగా వుండు యింక. ఎప్పుడు ఎదురు చెప్పక. మేం వెళ్ళాక దాన్నేమన్నా చేస్తావేమో. జాగ్రత్త'' హెచ్చరించాడు శరత్.

''బాబూ!...నేనిక్కడ వుండను బాబూ, మీ రెళ్ళాక ఆడు నన్ను సంపేత్తాడు'' అంది గురువారీ భయంగా ఏడుస్తూ.

''అదీ నిజమేరా. ఈ కోపం దానిమీద చూపించి చితకకొడతాడు దాన్ని'' అన్నాడు సంతోష్.

''ఏడశాడు మళ్ళీ యింకా తెలెత్తుతాడా?''

''అది సరేకాని దాన్ని చావగొట్టాక మనం ఏం చేసినా ప్రయోజనం ఏమిటి?''

సాహు మాట్లాడకుడా మిర్రిమిర్రి చూస్తున్నాడు, అందరినీ ఎగిసి పడే గుండెలతో. వాడి కళ్ళలో క్రౌర్యం చూస్తే తనే మైనా సరే దాన్ని అంత సులువుగా వదలను అన్న అర్థం కనిపించింది అందరికి 'మరేం చేదాం దీన్ని మన మెక్కడికి తీసుకు వెళాదాం' సాలోచనగా అన్నాడు నిరంజన్.

''ఒరేయ్ – ఈ రాత్రి యీ పక్కవాళ్ళెవరి గుడిసెలోనన్నా పడుకోమందాం.'' పాత్రో అన్నాడు.

సాహుకి పోటీగా ప్రక్కనే టీ హోటల్ 'సదానంద్' వాళ్ళ ప్రాపు కోసం ప్రాకులాడుతుంటాడు. అదే మంచి సమయం వాళ్ళని ఆకట్టుకోడానికని గ్రహించి ముందుకువచ్చి ''ఆ పిల్లని మా గుడెసెలో పడుకోబెట్టుకొంటాం మరేం భయంలేదు దాని వంటిమీద యీగ వాలనీయను, అన్నాడు వాడికి పెళ్లాం పిల్లలున్నారు.

''ఆ.. అలాచేద్దాం, జాగ్రత్త వీడెవన్నా గొడవచేస్తే మా హాస్టలుకి వచ్చి చెప్పు'' అంటూ ముందుకికదిలాడు నిరంజన్. అందరూ సాహు వంక గర్వంగా చూస్తూ బయటికి నడిచారు. వెళ్ళేముందర శరత్ సాహు కట్టువిప్పి 'యింక ఏడు' అన్నాడు.

''దొంగలంజా కొడుకు, మనం సమయానికి అడ్డుకోకపోతే ఆ పిల్లని నలిపి పారేసేవాడు.. బండవెధవ...'' తనో ఘనకార్య చేసినట్టు అన్నాడు నిరంజన్.

''ఏమో ఏం చేశాడో, ఏం లేకపోతే ఆ పిల్ల అంతలా ఎందుకు భయపడ్తుంది జరగాల్సింది జరిగిపోయిందేమో?''

వాళ్ళు నిజంగా అన్నంతపని చేస్తారన్న సంగతి తెల్సిన ఆసాహు ఉదయం లేచేసరికి మాయమయిపోయాడు. ఆ వూళ్లో వాళ్ళని కాదని బ్రతకడం కష్టం అని వాళ్ళు లేకపోతే ఒక్క క్షణం తన హోటలు నడవదన్న విషయం అర్థం చేసుకుని, యింక ఆ వూళ్లో బ్రతికేమార్గం లేదని గ్రహించి విరగ్గా మిగిలిన గిన్నెలు బట్టలు మూట కట్టుకొని తెల్లారేసరికి వెళ్ళిపోయాడు వెళ్ళే ముందు సదానంద్ యింటికి వచ్చి గురువారీని లాక్కెళ్ళడానికి ప్రయత్నించాడు. అది ఏడ్చి గోల పెట్టేసరికి సదానంద్ హాస్టలుకి మనిషినిపంపే సరికి భయపడి గురువారీని కసిదీరా కొట్టి బండబూతులు తిడుతో వెళ్ళాడు.

పీడా పోయింది అనుకున్నారంతా!

★ ★ ★ ★ ★

సాహు గాడి గొడవల్ల సదానంద్ హోటలుకి గిరాకీ ఎక్కువయింది అక్కడికి వెళ్ళే ఆ గ్రూపంతా సదానంద్‌కి కాతాదారులయ్యారు. ఓ రెండు రోజులు ఊరుకుని. గురువారీ విషయం ఎవరూ ఎత్తక పోయేసరికి సదానంద్‌యే ఒకపూట ''బాబూ, మరి గురువారీని ఏం చేస్తారుః'' అన్నాడు టీ తాగుతున్న వాళ్ళతో.

సాహు పని చేయించుకుని తిండిపెట్టి యింట్లో వుంచుకునేవాడుగా. నీవూ అలాగే వుంచుకో.'' అన్నడు పాత్రో అదో పెద్ద విషయం కాదన్నట్టు

''నా దగ్గరా.. నాకెందుకు బాబు, నాకు పెళ్ళాం వుంది... ఎదిగిన పిల్లలున్నారు సాయానికి. యింక యిదెందుక,''

''చచ్చాం, మరెలా? ... ఎక్కడుంటుంది?'' అన్నాడు విసుగ్గా మిశ్రా.

''అలాగంటే ఎలా బాబూ అదేం చెపుతుంది. చిన్నగుంట. ఆ సాహుగాడు మీ వల్లేగదా వెళ్ళిపోయాడు. మీ రనవసరంగా కల్పించుకొకపోతే అదోపూట, క్రొత్తలో గోలెట్టినా ఆడితో సర్దుకు బ్రతికేది, సిన్నతనంగా, మొదటిసారి క్రొత్తగదా అని గోలెట్టింది. ఆ పాటి దానికిమీరు ఆడిని సితకబాదినారు యిప్పుడు యింక దానికి దిక్కెవరు దానికి మీరుగాక'' అన్నాడు దాని భవిష్యత్తుకి వాళ్ళే జవాబుదారి అన్నట్టు.

అందరూ మొహాలు చూసుకున్నారు. యిదెక్కడి తద్దినం అన్పించింది అందరికి. ''ఏమిటిరా బాబో, యీ గొడవ, నేరకపోయి యిరుక్కున్నాం'' అన్నాడు సంతోష్ ఇంగ్లీషులో. అందరూ కాసేపు కూడబలుక్కున్నాక, సదానంద్‌కి నచ్చచెప్పారు. తామంతా సదానంద్ హోటలుకే వస్తామని ఆశ చూపించి. గురువారీని వుంచుకుని తిండిపెట్టడానికి వప్పించారు వాళ్ళకి ఎదురుచెప్పే ధైర్యంలేక, ఎదురు చెప్పి బ్రతకలేనన్న భయంతో ఆఖరికి నసుగుతూనే అంగీకరించాడు సదానంద్.

వాళ్ళందరికి గురువారీ ఏమవుతుంది!? దానిమీద యింత అభిమానం ఇంటరెస్ట్ ఎందుకు, వాళ్ళకి దానికి ఏమిటి సంబంధం అని ఎవరన్న అడిగితే ఏం లేదు అనే జవాబు చెప్పాలి! ఓ ముక్కూ మొహం తెలియని పసిపిల్ల మీద, కొండలలో పుట్టి పెరిగిన ఆ పిల్ల మీద వాళ్ళకి అభిమానం ఎందుకు అంటే. వాళ్ళ గురించీ వాళ్ళ చుట్టుపక్కల వాతావరణం గురించీ చెప్తే కొంత అర్థం అవచ్చు.

ఆ వూ ర్లో యింజనీరింగ్ కాలేజి పెట్టాలన్న ఆలోచన వచ్చిన మహానుభావులు ఎవరోగాని. వాళ్ళని ఆ స్టూడెంట్సు తిట్టని రోజులేదు. యింకెక్కడా చోటు లేనట్టు ఎంచి ఎంచి మా ప్రాణాల మీదకి యిక్కడే పెట్టాలా అని రోజుకో సారన్నా అందరూ ఏడ్చుకునే వారు.

ఆ వూరు వూరేమిటి అదో ఆఫీషల్ కాలనీ. అక్కడొక డామ్! డామ్ సిబ్బంది. ఓ యింజనీరింగ్ కాలేజి, మెడికల్ కాలేజి వున్నాయి. ఆ కాలేజిలో పనిచేసే

మనుషులు మాత్రం వుంటారు. యీ మాత్రం మనుష్యులున్నారు కనక ఓ చిన్న బజారులాంటిది తప్పదుగదా! ఆ వూరికి చాల్లే అన్నట్టు కనిపించీ వినిపించని రేకుల షెడ్డు సినిమాహాలు ఒకటి. నాలుగైదు పాక టీహోటళ్ళు, ఓ నాలుగు బట్టల దుకాణాలు, మరో నాలుగు పచారి దుకాణాలు, ఓ రెండు ఫ్యాన్సీ షాపులు, ఓ బస్‌స్టాండ్ – యిదే ఆ వూరు!

అందులో ఇంజనీరింగు కాలేజి వూరిచివార్న వుండేమో, ఎటు చూసినా వినీలాకాశం తప్ప మరోటి కనిపించక, ఎంతసేపు స్టూడెంట్స్ ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ ఏం చెయ్యడానికి తోచనప్పడల్లా అక్కడ కాలేజి పెట్టిన వాళ్ళని తిట్టుకునే వారు.

ఉదయం ఏడుకి లేచిందగ్గరనించి కాలేజికి పరిగెత్తడం, క్లాసులు వగైరాలతో ఉదయంపూట అందరికి ఏదో విధంగా గడిచి పోతుంది ఎటొచ్చి వాళ్ల అవస్థంతా సాయంత్రం ఐదునుంచి తొమ్మిదివరకు! ఎక్కడి వెళ్ళడానికి ఏం చేయడానికి తోచక పిచ్చెత్తి పోయేవారు. అక్కడికి సాయంత్రం కాలేజినించి వచ్చి కాస్త రెస్టు తీసుకుని స్నానాలు చేసి, ముస్తాబయి, హాస్టలుకి ఎదురుగా వుండే పాక టీ హోటళ్ళలో రసగుల్లాలు, సింగడాలుతిని, టీ తాగి అక్కడ నించి జట్లు జట్లుగా రోడ్డున పడి బజారుదాకా వెళ్ళేవారు, రోడ్డంటె రోడ్డే తప్ప మనుష్యులు మాత్రం కనిపించరు! కనిపించినా ఏ ఆఫీసర్ల తాలుకు బంట్రోతులో ! అలా షికారుకి వెళ్ళేత్రోవలో డామ్ ఇంజనీర్లు బంగాళాలు దాటూ ఏ బంగాళానించన్నా ఏ అందమైన అవిడో కనిపించితే కన్నుల పండుగ అయినట్టు వీక్షిస్తూ, కామెంట్లు చేసుకుంటూ జోకులు విసురుకుంటూ. తుళ్ళుకుంటూ నవ్వుకుంటూ నడిచిబజారు చేరేవారు. అక్కడికి చేరాక అమ్మయ్య యిదీ ఒక వూరే, స్మశానంకాదని పించేది వాళ్ళకి. దానికి నిదర్శనంగా బస్సుల రొద, టాక్సీల హారన్లు రేకుల షెడ్డు సినిమా వాడు అదరగొట్టే రికార్డుల మోత, కాకా హోటళ్ళనించి వచ్చే పకోడిల వాసన, బజారుకి ఏదన్న కొనుక్కోడానికి వచ్చే మనుష్యులు కళ్ళు పడగానే వాళ్ళకి ప్రాణం లేచివస్తుంది. అక్కడ నిలబడి జనాన్ని చూడడం, లేకపోతే సినిమా మారితే అదెంత చెత్తయిన, కనిపించకపోయినా వినిపించక పోయినా మూడు గంటల కాలక్షేపానికి దాన్లో దూరే వాళ్ళు. అదీ లేకపోతే ఏ హోటలులోనొ దూరి ఏదో తింటూ కబుర్లు చెప్పుకుంటూ గంటలకొద్ది గడిపేవారు. ఏ ఏడుగంటలకో తప్పదురా భగవంతుడా అన్నట్టు కాళ్లీడ్చుకుంటూ హాస్టల్ మొఖం పట్టేవారు.

అక్కడికి పదిమైళ్ళున్న టౌనుకి సినిమాకి ఆదివారం ఆదివారం వెళ్లడం

వాళ్ళకున్న ఏకైక కా క్షేపం! ఆ సినిమికి వెళ్ళడినికి ఆ వూరికి, టౌనుకి మధ్య తిరిగే టౌనుబస్సులో టాపుమీద కూడా ఎక్కి, టిక్కట్లు యివ్వకుండా ప్రయాణం చెయ్యడం ఏ కండక్టరన్న వాళ్ళ సంగతి తెలియని వాడు - ఏనాడన్న టిక్కట్టు లేదని గొడవ పెడితే వాడిని తన్నడం. దాంతో బస్సు వెళ్లనియకుండా కాపుకాసి అల్లరిపెట్టి మళ్ళీ సాధించడం వాళ్ళ ముఖ్యమైన ఎడ్వంచర్.

అక్కడికి నూరు మైళ్లున్న సిటీకి కొత్త సినిమా రిలీజయిందన్నది తెలిస్తే చాలు కనీసం ఓ వందమంది బయలుదేరి యిటునించి బయలుదేరే ప్యాసింజర్‌కు వెళ్ళి మొదటి ఆట మ్యాటినీ చూసి తెల్లవారి వచ్చేరైలు లో టిక్కట్లు లేకుండా ఫస్టు క్లాసులో ప్రయాణం చేసి, ఆ రైలు వాళ్ళుండేవూర్లో ఆగదు కనక వాళ్ళ కాలేజి దగ్గరకు రాగానే గొలుసులాగి గెంతి పరిగెత్తి పోవడం వాళ్ల సాహసాలలో ముఖ్యమైంది. వాళ్ళని టిక్కెట్టు అడిగే ధైర్యం, వాళ్లతో కలపడగలిగే సాహసవంతుడు ఎవరూ వుండే వారుకాదు. చూసీ చూడనట్లు వూరుకునేవారు. ఏవడన్న ఏదన్నా అంటే ఆరైలు నడవదని వాళ్లకి తెలుసు! వాళ్లకక్కడ మరీ బోర్ కొట్టి యింటికెళ్లి రావాలని బుద్ధి పుడితే ఏదో గొడవ లేవదీసి స్ట్రయిక్‌చేసి కాలేజి బంద్ అయిందినపించుకొని ఊరికెళ్ళిపోయేవారు ఆవూర్లోవుండేమెడికల్ కాలేజి యింజనీరింగు కాలేజి విద్యార్థులు యిద్దరూ బద్ధ శత్రువులు! ఒకరి సుపీరియారిటీ ఒకరికి నిరూపించుకోవాలన్న తాపత్రయంతో ఒకరి నొకరు ఎప్పుడూ ద్వేషించుకుంటారు. మనసులో ద్వేషం అప్పుడప్పుడు బయట పడితే కొట్టుకోవడం, వాళ్ళ ప్రొఫెసర్ల యిళ్ళమీదకి వీళ్ళు, వీళ్ళ ప్రొఫెసర్ల యిళ్ళ మీదకు వాళ్ళు రాళ్ళు రువ్వకోవడం, పోలీసులు, గొడవ హడావిడి - యిలాంటి వన్నీ వాళ్ళకి కాలక్షేపాలు!

ఇదీ వాళ్ళ కాలేజి! ఇలాంటి కాలేజిలో చేరడానికి మూర్తి అంధ్రదేశం నడిగడ్డ మీదనించి అక్కడ సీటు దొరక్క వచ్చాడు. యితరులకిచ్చే నాలుగు సీట్లలో వకటి సంపాదించుకుని! రాగానే ఆవూరు, వాతావరణం చూసి బెంబేలు పడిపోయాడు వారానికి రెండు రిలీజయ్యే కొత్త సినిమాలు చూసే అలవాటున్న మూర్తి ఆడొక్క హా లో ఎప్పటివో పాత హింది సినిమాలు చూడాల్సి వచ్చిన దురదృష్టానికి గాభరాపడిపోయాడు. భాషన్నా తెలియని ఆవూర్లో మాట్లాడుదామన్నా మనిషి లేక బెంబేలు పడిపోయాడు. కాలేజి మొత్తానికి పాతిక ముప్పై మంది తెలుగు విద్యార్థులు వుండేవారు. వాళ్ళంతా సీనియర్స్ జూనియర్ మూర్తితో మాట్లాడడం వాళ్ళకి నామోషి, మాట్లాడినా ఆప్యాయత వుండేది కాదు. మిగతా వాళ్ళు వాళ్ళతో వాళ్ళ భాష మాట్లాడడుకుంటూంటే మూర్తి ఒక్కడూ వెర్రివాడిలా తిరిగేవాడు.

నా అన్న వాళ్ళందరికి దూరమై అమ్మ కమ్మగా వండిపెట్టే భోజనానికి దూరమై, భాషన్నా తెలీని అవూర్లో పరభాష పరదేశపు అలవాట్లకి అలవాటు పడలేక గిలగిలలాడి పోయాడు. ముఖ్యంగా భోజనానికి మొహం వాచిపోయాడు నెలరోజులకే. హాస్టలు భోజనం - దాన్ని భోజనం అనడానికి వీలులేనంత అధ్వాన్నంగా వుండేది. ఆ రుచులకు అలవాటుపడిన వాళ్ళవాళ్ళే ఆ తిండి తినలేకపోయారు. నీళ్ళపప్పు, ఆలుతర్కారి - అంటె మసాలా రసంలో తేలే నాలుగు బంగాళాదుంపలు, ఓ 'భజా' అంటే వేపుడు, వేపుడంటే రెండు నిలువుగాతరిగిన వంకాయ ముక్కలు, లేక కాయపళంగా యేయించిన రెండు బెండకాయలు - యిదీ! సరే, పెరుగన్నది వాళ్ళకి అలవాటు లేదేమో కావాలన్నా దొరికేది కాదు. ఉప్పు కారంలేని ఆ భోజనం తినడానికి కళ్ళమ్మట నీరువచ్చేది మూర్తికి. తక్కిన తెలుగుమిత్రులు అప్పటికి కాస్త అలవాటుపడి వున్నారేమో పెట్టిందేదో మింగకతప్పదు అన్నట్టు తినేసేవారు. హోటలుకి వెళ్ళినా నాలుగు రకాలుపెట్టే తెలుగు భోజనానికి అలావాటుపడిన మూర్తి అవస్థ వర్ణనాతీతం! శాఖాహారం కంటే మాంసాహారం కాస్త నయం అని కొందరది తినేవారు. హాస్టలులో భోజనంతప్ప టిఫిను యిచ్చేవారుకాదు. అంచేత ఉదయం కాలేజీ ఎదురుగావుండే పాక హోటళ్ళలో ఏ సింగడాలో, వడలో, పకోడీలో తిని టీ త్రాగడం తప్పేదికాదు, సాయంత్రమూ తప్పేది కాదు. ఆ పెట్టె భోజనం రాత్రి పదిలోపల పెట్టరేమో, కాలేజీనించి రాగానే టిఫిన్ తినడం తప్పనిసరి. అలాంటి దురవస్థలో ఆ కాలేజి విద్యార్థులందరూ, హాస్తలు కెదురుగవుండే పాక హోటళ్ళమీదే ఆధారపడేవారు!

అలాగే ఆ హోటళ్ళవాళ్ళు వీళ్ళమీదే ఆదారపడేవారు. వూరికి దూరంగా వుండే ఆ హోటళ్ళకి యీ విద్యార్థులు తప్ప యితరులు వచ్చే అవకాశం లేదేమో కేవలం స్టూడెంట్సుమీదే వాళ్ళ బిజినెస్సు అధారపడివుండేది. అంచేత వాళ్ళు అంటే హోటళ్ళవాళ్ళకి భయం. భక్తివుండేవి. వాళ్ళతో తగువు తెచ్చుకుంటే అక్కడింక వాళ్ళు బ్రతకలేరన్నది వాళ్లకి తెలుసు. అంచేత స్టూడెంట్సు అరువులు పెట్టినా ఓపిగ్గా డబ్బిచ్చేవరకు వుండేవారు.

హాస్టలుకి ఎదురుగావున్న నాలుగైదు హోటళ్ళలో 'సాహు' హోటలుకి మంచి గిరాకీ వుండేది సాహు అసలు పేరు 'జుధిష్టోరోసాహు' జుధిరోష్టో అంటే యుధిరిష్టుడు! అంటే ధర్మరాజు ! ధర్మం వాడి పేరులో తప్ప మనిషిలో పుటంవేసినా కనపడదు! వాడి బుద్ధి ఎలాంటిదై తేనేం గాని వాడి ఆకారం చూసిన వాళ్లకి మాత్రం ఆహోటలులో టిఫిను దిగనంటుంది మొదట్లో ! సాహు నల్లగా

ఎద్దులా వడ్డు పొడుపుగావున్న నలభైఏళ్ళ మనిషి. మొఖం అంతా స్ఫోటకం గంట్లు – పచ్చటి వళ్ళు ఆ నల్లటి మొహంలో వికృతంగా కనిపించేవి. ముందు రెండు పళ్ళు ముందుక తోసుకువచ్చి వికృతంగా కనిపించేవి కారాకిళ్ళీతో గారపటిట్టీన ఆ పళ్ళు చూస్తే చాలు వాంతవుతుంది. కాకులుపీకిన తాటిపండు లాంటి జుట్టు, అసలే ఎర్రటి కళ్ళు తాగుడు మరింత తోడయి ఎప్పుడూ ఎర్రగా వుంటాయి కళ్ళు. మనిషి మాట్లాడుతుంటే నోటమ్మట కిళ్ళీ రసం కారుతూంటుంది. మనిషి దగ్గర వస్తే చాలు కంపు! చమట, సారా, కిళ్ళీ అన్నీ కలిసిన ఆ వసనని యిలా అని వర్ణించనలవి కాని కంపు!

అలాంటివాడి హోటలుకి మిగతా వాళ్ళెవరికీలేని గిరాకి ఏమిటాఅని ఆశ్చర్యపోతారు ఎవరన్నా. మూర్తికీ అర్థంగాలేదు మొదట్లో. తెలుగు మిత్రులని ఓ రోజు ఆ మాట అడిగాడు. 'అబ్బ యిలాంటి వాడినిచూస్తూ యీ హోటలులోనే ఎందుకు తింటున్నారు. మరో దానికి వెళ్ళకూడదూ అంటూ ఆసహ్యాన్ని వ్యక్తంచేశాడు 'నీకు తెలియదులే' అంటూ మూర్తి అమాయకత్వానికి వాళ్ళలో వాళ్ళు నవ్వుకున్నారు తప్ప, సరిఅయిన జవాబు చెప్పలేదు కొత్తగా కాలేజిలో చేరిన వాళ్ళని వట్టి అమాయకులుగా తీసి పారేసి ఏడిపించడం సీనియర్స్‌కి అలవాటు : కొన్నాళ్ళు గడిచాక ఎవరు చెప్పకపోయినా మూర్తికి సంగతి అర్థం అయింది. ఆ హోటలులో అందరిని ఆకర్షించేది సాహు పెట్టే ఫలహారాలు కాదని, సాహువుంచుకున్న 'లొక్కి' (లక్ష్మి వికృతి) అని అర్థం చేసుకున్నాడు. అది బోధపడ్డాక, ఓ రోజు వెంకట్రావుని అడిగితే అతను చెప్పిన సారాంశం యిది.

లొక్కికి యిరవైకి పాతికకి మధ్య వుంటుంది వయసు. లొక్కిని చూస్తే అందగత్తె అని ఎవరూ అనరు . కాని దాన్ని చూశాక ఎవరైనా సరే మరోమాటు దాన్ని వాళ్ళకి తెలియకుండానే కళ్ళెత్తి చూస్తారు. ఏదో చెప్పలేని ఆకర్షణ– ఆ ఆకర్షణ ఎక్కడుందో కూడ తట్టదు. దానివంటి రంగు నలుపు ఆ నలుపులోనే ఏదో అకర్షణ, అందం – జమజట్టీలా వడ్డుపొడుగున్న ఇనుప కడ్డీలాంటి శరీరం – జాకట్టు తొడుక్కోని దాని సౌష్టవం, దాని పొంకం అవే దానికి ముఖ్య ఆకర్షణలు! చక్రాల్లాంటి కళ్ళలో అదో మెరుపువుంది! చిన్నముక్కు, దానికి వంటిగాజు రాయి ముక్కుపుడక – ఆ పెదవులు బండగా, నల్లగావున్నా దాని అందం పెదాలలోనే ఎక్కువ వుందేమో అనిపిస్తుంది. ఆ పెదవి ఎరుపులో ఏదో కవ్వింపు కళ్ళతో నవ్వేది కొంటెగా? మాట్లాడకుండానే పెదవి విరుపుతో కవ్వించేది – ఎవరయినా ఒక్కసారి చూస్తే మళ్ళీ మళ్ళీ కనీసం కళ్ళతోనైనా చూడాలని కోరతాడు. నీటుగా నున్నగా, తలదువ్వి పక్కకి కొప్పుపెట్టేది. తప్పకుండా ఏ కాలంలో ఆ కాలం పువ్వులు పెట్టేది.

మొహానికి ఏదో పౌడరుపూసి యింత బొట్టు పెట్టి ఎప్పుడూ నీటుగా వుండేది. చేతికి వెండిగాజుల మధ్యాగాజు గాజులు మామూలు కొండవాళ్ళలా కాకుండా లోపల పరికిణీకట్టి మరీ చీర కట్టేది. మొత్తం ఎప్పుడూ నలగని మాయని మనిషిలా వుండేది.

ఆడపురుగులు కనిపించని ఆ కాలేజిలో ఆ 'లొక్కి' ఏ వాళ్ళకి అముదం వృక్షం! తెలిసీ తెలియని నూతన యవ్వన 16, 17 సంవత్సరాల వయసు నించి అమాయకత్వాన్నించి దాటి గడుసు దేరిన, ఉరకలు వేసే వయసు వాళ్ళది అలాంటి వయసులో, ఆడదన్నది కన్పించని ఆ వాతావరణ,లో లొక్కి వాళ్ళననుగ్రహించి దేముడు పంపిన దేవతలా అనిపించింది! దానికి తోడు దాని చూపులు, కవ్వింపు! కనీసం దాన్ని కళ్ళతో జూసి ఆనందించే అవకాశానికి ఉదయం సాయంత్రం తప్పనిసరగా సాహు హోటలుకి వెళ్ళేవారు అందరూ, తాగేది కప్పు టీ అయినా సరే ఓ అరగంట అక్కడ బైఠాయించి తనివితీరా చూస్తూ, దానికి అర్థంకాకుండా ం యింగ్లీషులో మాట్లాడుకుంటూ, అది వాళ్ళన్ని చూసి కొంటెగా నవ్వినప్పుడల్లా ఐసు అయిపోతూ, అది కావాలని ఏ చెయ్యో తాకిస్తే కరిగి పోతూ రోజూ రెండు గంటలు దాని సందర్శన భాగ్యంతో సంతృప్తి పడే వాళ్ళు! ప్రతివాడు తనమీదే లొక్కి ఎక్కువ ఇంటరెస్ట్ చూపిస్తున్నట్టు గర్వపడి, సంతోషపడేట్టు అందరిని చాకచక్యంగా ఆకర్షించి ఆకట్టుకునేది.

''అమ్మముండా, చూడరా, చూడరా దాని కులుకు'', '' లంజముండ ఏదో వుందిరా దీన్లో.'' దీనిసిగ తరగ యిదే ఏ సినిమా తారో అయితే రాజ్యం ఏలేదిరా'' ''యీ సాహుగాడు, వెధవమొహం వాడూనూ ఏం ఛాన్సుకొట్టాడురా'' అంటూ దాన్ని గురించి మాట్లాడుకుంటు సాహు అదృష్టానికి అసూయ పడేవాళ్లు.

లొక్కిని సాహు ఓసారి 'కోరాపుట్టి' సంతకెళ్ళినప్పుడు తీసుకొచ్చాడుట. దాని తల్లి తండ్రి కొండలోపుట్టి అడవిలో కర్రలు కట్టుకుని కొండ దిగువకి తీసుకొచ్చి కట్టెలు అమ్ముకుని జీవించే అతి బీదవాళ్ళు, లొక్కి చిన్నప్పటినించి, అంటే పదేళ్ళప్పటినించి తల్లిదండ్రుల వెంట ఆడివికి వెళ్ళడం, కట్టెలు కొట్టడం, ఆ మోపు నాలుగు మైళ్ళు కొండదిగువకి మోసుకొచ్చి అమ్మే కష్టజీవితానికి అలవాటు పడింది. ఆ బండపనిలో మోటు దేరిపోయింది. అలా బ్రతుకుతూనే యిరవై ఏళ్ళదయింది. పదిహేడేళ్ళప్పుడు వాళ్ళ జాతివాడితో మనువయింది. మూడేళ్ళు కాపురం చేశాక వాడు మరో కరిని తగులుకుని దీన్ని వదిలేశాడు. ఆ సమయంలో కోరాపుట్టి సంతకెళ్ళిన సాహు దీన్ని చూసి 'నాతో వస్తావా, నాకు హోటలుంది, కట్టెలు కొట్టి కష్టాలు పడాల్సిన భయంలేదు. నీకు కావాల్సినంత

తిండిపెడతాను. వెండికడియాలు, బంగారు కమ్మలు చేయిస్తాను అని ఆశ పెట్టాడట. కొండలలో పుట్టిపెరిగిన లొక్కి బస్తీ జీవితానికి మోజుపడి వప్పేసుకుని అప్పటికప్పుడు తల్లిదండ్రులకి కూడా చెప్పకుండా వీడితో బస్సెక్కి వచ్చేసింది మూడేళ్ళనించి సాహుదగ్గిరే వుంటుంది.

లొక్కి వచ్చిందగ్గిరనుంచి సాహుగాడి పని మూడు పువ్వులు ఆరు కాయలుగా వుంది జవుజట్టీలా వుంటుందేమో కర్రలు కొట్టిన శరీరానికి హోటలులో పప్పు రుబ్బడం పకోడీలు వేయడం ఏం కష్టం . ఆడుతూ పాడుతూ సునాయాసంగ పనంతా అదొక్కర్తే చేసేసేది. సాహుగాడు అన్ని పనులకు తర్ఫీదు యిచ్చాడు. ఇదివరకు లావాడు పొయ్యి దగ్గర కూర్చుని మాడనక్కర లేకుండా అన్ని పనులు దాని నెత్తిన పెట్టి గల్లాపెట్టి దగ్గిర కూర్చునే స్థాయికి మారాడు. పగలంతా చచ్చే చాకిరి చేసేది... రాత్రి స్వర్గం చూపించేది!.... తన అదృష్టానికి పొంగిపోయేవాడు సాహు. అంతే కాక లొక్కి వచ్చిం దగ్గర నుంచి హోటలుకి గిరాకీ పెరిగింది. ఆ గిరాకీ ఎందువల్లో తెలుసుకోలేనంత అమాయకుడు కాదుసాహు.

లొక్కి వచ్చిన ఓ ఏడాది వరకు మొద్దులాచాకిరి చెయ్యడం మినహా గడుసుదనం లేకుండా అమాయకంగా వుండేది. తర్వాత తర్వాత చుట్టూ ప్రపంచాన్ని చూసి తెలివి మీరింది. అడవిలో పెరిగిన అమాయకత్వాన్ని వదిలి గడుసు మీరింది. ఆ హోటలుకే అందరూ ఎందుకు వస్తున్నారో, తను ఎంతమందిని ఆకర్షించగలుగుతూందో అర్థం చేసుకునేటంత తెలివి మీరింది. ఏ ఙార్థం గడిచే సరికి దానికి చాలా మార్పు వచ్చింది. నీటుగా ముస్తాబవడం, చిరు నవ్వులు ఒలకబోయడం, ఓరగా చూస్తూ కళ్ళతో కవ్వించడం. ఎవరన్నా ఏదన్నా హాస్యానికి అంటే 'పో బాబూ'' అంటూ ముద్దులు గునవడం. వరకు నేర్చేసుకుంది.సాహుకి ఇదివరకులా భయపడటం. వదిగి వదిగి ఉండడం మానేసి వాడేదన్నా అంటే జవాబు చెప్పడం, కసిరితే నిర్లక్ష్యంగా దులిపేసుకోవడం, యింకా వాడు గట్టిగా అంటే తిరగబడి జవాబు చెప్పేంత రాటుదేరింది.

స్టూడెంట్సు హోటలుకు రాగానే ఏపని చేసున్నా వదిలేసి వచ్చేది.

''ఏం కావాలి బాబూ. ఏం తింటారు?''

అంటూ కుర్చీలు బల్లలు శుభ్రంగా దులిపి ఎటన్షన్ చూపేది. సాహు దాని కులుకులు కోపంగా చూస్తూ ''నీవెళ్ళి పప్పురుబ్బు, ఆళ్ళ కేంకావాలో నే చూస్తాలే'' అనేవాడు. అది పట్టించుకోకుండా ''రుబ్బుతాలే, యింతసేపు రుబ్బి రుబ్బి చేతులు పడిపోయాయి''. అని నిర్లక్ష్యంగా వాళ్ళకేం కావాలో అమర్చేది.

వాళ్ళకి చాలా సంతోషంగా వుండేది, ఆఖరాఖరికి అందరూ సాహు పలహారం పెడితే తినమని మొరాయించారు.

"అబ్బా! నీ హోటలులో పలహారాలు యింత రుచిగా వుంటాయి వాటి రుచి నీ వెదురుగా కనిపిస్తే పోతుంది. మమ్మల్ని కాస్త హాయిగా తిననీయి".

అంటూ హాస్యంగ అంటున్నట్టే అని వాడి రూపుని వెక్కిరిస్తూ వాడిని గలాల్పెట్టి దగ్గరకి పంపేవారు వాళ్ల కెదురు చెప్పలేక చెపితే రారేమోననే భయంతో మొహం మాడ్చుకుని గల్లాపెట్టి దగ్గిర కూర్చునేవాడు. అయినా ఓ కన్ను లొక్కిమీద, ఓ కన్ను స్టూడెంట్లుమీద వేసే వుండే వాడు. అయినా ఏదో సందులో లొక్కి వాళ్ళని కళ్ళతో కవ్విస్తూ ముద్దులు గునుస్తూ మాట్లాడుతూ, చేయి తాకించాలని తాకిస్తూ వాళ్ళందరికి పెద్ద ఆకర్షణ అయి కూర్చుంది.

సాహు ఏ బజారుకో వెళ్ళాడంటే దానికి వాళ్ళకి యిద్దరికీ పండుగే వాళ్ళతో నవ్వుతూ గలగలా మాట్లాడేది. వాళ్ళు హాస్యాలాడితే ముసిముసి నవ్వులు నవ్వేది. "బాబూ యీ పౌడరేమిటి? ఎక్కడ దొరుకుతుంది అనేది. "కావాలా రాసుకుంటావా." అనేవాడు ఒకడు. "నాక్కాదు బాబూ! ఆ సచ్చినోడి కింత పాముదామని ఉత్తికంపు బాబూ! ఎదవ" అంటూ మొహం ఆసహ్యంగా పెట్టేది.

"అబ్బ! మీ దగ్గిరెంత మంచి వాసన, బాబూ ఏటి రాసుకుంటారు? అమ్మో! యీ నూనె ఎంత చక్కగా వుందో వాసన" అంటూ వాళ్ళతల నూనెనో సెంటువాసనో చూడడానికన్నట్లు దగ్గిరిగావచ్చి తాకుతూ చూసేది. వాళ్ళకు మతులు పోయేవి. "అ దొంగ సచ్చి నోడు యీయన్న రాసుకున్నా బాగుండు. చస్తున్నా" అనేది. కొంటెగా దాంతో వాళ్ళుదాన్ని కవ్వించడానికి సానుభూతి చూపిస్తున్నట్టు "అబ్బబ్బ ఆ సాహుగాడిని ఎలా భరిస్తున్నావు, నీ వింత చక్కగా వుంటావు వాడో ఎద్దు. గాడిద.. ఛా.. నీవు కాబట్టి వుంటున్నవు" అని కిర్రెక్కించేవాళ్ళు.

"ఏం చెయ్యను బాబూ.. ఆడవిలో పడుండే దాన్ని.. అప్పుడు తెలీక వెంటబడి వచ్చాను. యిప్పుడెక్కడికిపోను" అనేది జాలిగా.

అంతకంటే యింకేదన్నా అంటే తమతోలేచి వచ్చేస్తా నంటుందేమోనని భయం అందరికి.

సాహు నెలకోసారిసరుకులు చవగ్గా దొరుకుతాయని రాయగాడా సంతకి వెళ్ళేవాడు. ఆ రెండు రోజులు దానికి ఆటవిడుపు. ఆసదవకాశాన్ని స్టూడెంట్లలో కొందరు సాహసవంతులు, రసికులు వినియోగించుకునేవారు. పాపం స్నోలు పౌడర్లు గాజులు యిలాంటి చిన్న బహుమతులంటే ఆశపడేది లొక్కి.

లొక్కి వ్యవహారం ముందులో కనిపెట్టలేకపోయినా తరువాత కనిపెట్టాడు సాహు పిచ్చి వేషాలేస్తే ముక్కెలిరగ తంతాను అని బెదిరించాడు. అది లక్ష్య పెట్టలేదు. ఆఖరాఖరికి స్టూడెంట్లని ఏమనే ధైర్యంలేక ఆ కోపం అంతా లొక్కి మీద చూపించి రోజూ తన్నడం అరంభించాడు. అది నోరిప్పి వాళ్ళతో ఏం మాట్లాడినా కసిరేవాడు. వాళ్లతో పూర్వంలా కాకుండా ముభావంగా మొహం గంటు పెట్టకుని మాట్లాడేవాడు. వాడి హోటలు దివాళ తీస్తుందన్న భయంలేకపోతే దాన్ని వాళ్ల ని కలిపిపాతే సేవాడేమో తనే పూరన్నా వెడితే లొక్కికి ఓ ముసలిదాన్ని కాపలా పెట్టేవాడు. ఆ ముసలిదాని కళ్ళు కప్పి యధాప్రకారం ఆటలు ఆడేదిలొక్కి. సాహు రాగానే ముసలిది కంప్లైంటు చేయగానే కుళ్ళ బొడిచేవాడు సాహు. అఖరాఖరికి సంతలకి తను వెళ్ళడంమాని మరెవరినో పంపి దాని ఆట అన్ని వైపులనుంచి కట్టేయించాడు. రోజు రోజుకి వాడు పెట్టే భాధలువాడిచేత తన్నులు తినలేక రాజుని చూసిన కళ్ళకి సావెంతలా లొక్కికి సాహుగాడి సహచర్యం భరించడం దుర్లభమయింది. అప్పుడప్పుడు ఆవకాశం దొరిగితే రహస్యంగా తన బాధలు వాళ్ళతో చెప్పుకుని కళ్ళనీళ్ళు పెట్టుకునేది. దాని అందాన్ని పొగడడం తప్ప దాని కన్నీళ్ళని తుడిచేశక్తి వాళ్ళకేది.

ఆఖరికి ఓ రోజు తెల్లారేసరికి లొక్కి మాయమయిపోయింది. కొన్నాళ్ళ తరువాత తెల్సింది ఏమంటే ఎవడో లారీ డ్రైవరుతో లేచిపాయిందని ప్రక్క వూరిలో వుందని..'' ఆ లారీ డ్రైవరు పేంటు. షర్టు చేతికి వాచి వాడి ఉంగరాల జత్తు అన్ని చూసి మోజుపడింది' ముండ, నాలుగు రోజు లుంచుకుని తన్నేస్తాడు రోగం కుదురుతుంది ముండకి'' అని తిట్టుకున్నాడు సాహు కసిగా.. అంతకంటే ఏం చేయలేక.

లొక్కి వెళ్ళిపోయాక స్టూడెంట్లందరికి కొన్నాళ్ళు మతిపోయినట్లయింది కాలక్షేమం లేక కొట్టుకు పోయారు. వాళ్ళ ఉత్సాహన్నంతా లొక్కి లాక్కుపాయినట్లని పించింది, సాహు హోటలుకి అడుగు పెట్టాలంటే చిరాకనిపించేది. లాభాలు తగ్గిపోవడం అందరూ మరో హోటలుకు వెళ్ళటం చూసి తన వ్యాపారం దెబ్బ తింటుందని ఓరోజు.. ''లంజముండ పోతేపోయింది దీని బాబులాంటిదాన్ని మరోత్తిని తెస్తాను'' అంటూ వెళ్ళాడు.

ఈ సారి ఎలాంటిదాన్ని తెస్తాడో అని అందరో ఆరాటంగా ఎదురు చూశారు. మూడోరోజున వచ్చిన సాహు వెంట ''గురువారీ'' వచ్చింది. దాన్ని చూడగానే అందరూ నిరుత్సాహపడ్డారు – గురువారీ బొత్తిగా చిన్నపిల్ల. పట్టుమని పదమూడు

నిండాయో లేదో? చామనచాయ రంగులో బక్కపలచగా అమాయకంగా వుంది, కళ్ళుమాత్రంపెద్దవి. ఆ కళ్ళలో క్రొత్త బెదురు, కొండలలో పుట్టిపెరిగిన ఆపిల్ల ఒక్కసారిగా పట్టణ వాతావరణంలో క్రొత్తగా అర్థం కానట్టు యిమడలేక బితుకు బితుకుమని చూసింది. గురువారీ....(పొరజా.. వాళ్ళు అంటే కొండజాతులలో ఒక తెగ! వాళ్ళు ఏ వారం పుడితె ఆవారం పేరు పెట్టేస్తారు పిల్లలకి) ని రెండొందలు యిచ్చి కొని తెచ్చాడట సాహు పిల్లల్ని అమ్ముకునే తల్లిదండ్రులు యింకా వున్నారా అని ఆశ్చర్యపడ్డరు అందరూ. ''వాళ్ళ కేటి బాబూ, వాళ్ళ కివన్నీ ఏటితెలుసు, పిల్లలకి కొదవావాళ్ళకి, డబ్బిస్తే ఎక్కడో అక్కడ పిల్ల తన పొట్టపోసుకోగలదన్న ధైర్యం వాళ్లకి మనువు చేసుకోవాలన్నా డబ్బిచ్చి పిల్లని కొనుక్కోవాలి ఎవడు డబ్బిస్తే వాడితో పంపేస్తారు అన్నాడు సాహు.

'' అదిసరే, మరీ యింత గుంటని తెచ్చావు యిదేంచేస్తుంది అన్నారు నిరుత్సాహంగా కొందరు. ''గుంటేం, పద్నాలుగేళ్లున్నాయి మరో ఏడాదిపోతే అదే చూడండి ఎలా తాయారవుతందో? కాస్త చిన్న పిల్ల అయితే భయభక్తులుంటాయి బాబూ, ఆముండని చూశారుగా ఏం చేసిందో, అందుకే యిదయితేనే లొంగి పడివుంటుంద్జిన తెచ్చాను'' అన్నాడు సాహు.

అప్పుడే విడవబోతున్న మొగ్గలా అమాయకంగా వుండే ఆ పిలని చూస్తే ఎవరికీ లొక్కిలా అన్పించేది కాదు. ఆ పిల అంతపెద్ద రుబ్బురోలుముందు కూర్చుని రుబ్బలేక కష్టపడి రుబ్బుతుంకే, పొయ్యి సెగకి ఎర్రబడిపోయిన మొఖంమీద చెమట తుడుచుకుంటున్నప్పుడు. అందరికి భయభక్తులతో ఫలహారాలు అంది స్తున్నప్పుడు పాపం వయసుకి మించి శ్రమపడ్తోంది అని జాలి అనిపించేది. ''సాహు పాపం చిన్నపిల్లచే అంతపని చేయిస్తావేమిటి'' అని మందలించేవాళ్ళు. ''చిన్నపిల్లేటి, అయినా దీని బాబుకి రెండొందలు యిచ్చి వూరికే కూర్చో పెట్టటానికి తెచ్చానా అనేవాడు. సాహు ఆ పిలని కసిరినపుడు, పని సరిగా చెయ్యలే దని తిట్టినపుడు, తన పెద్ద కళ్ళనిండా నీరునింపుకుని అటు తిరిగి తుడుచుకునే ఆ పిల్లని చూసి అందరూ జాలి పడేవారు ఒకసారి గాజుగ్లాసు బద్దలు కొట్టిందని సాహు గురువారి చెంపమీద కొట్టాడు. ఆ పిల్ల బిక్క చచ్చిపోయి, కళ్ళనిండా నీళ్ళు నింపుకుని ఎవరి వంకా చూడలేక తలవంచుకుని లోపలికి వెళ్ళిపోయింది. దెబ్బతిన్న బాధ కంటె నలుగురిముందు అవమానం ఆ పిల్లకి ఎక్కువ బాధ కల్గిందని అర్థం అయింది. ఆవేశపరుడైన నిరంజన్ కోపంగా సాహు మీద ఎగిరిపడ్డాడు. గుడ్లెర్రచేసి, మరోమాటు గురువారిని ఏమన్నా అన్నా, చేయిచేసుకున్నా వూరుకోం అని బెదిరించాడు. ఆ పిలని యిలా బాధలుపెడితే నీ హోటలు గుమ్మ ఎక్కం అని

బెదిరించాడు. గురువారిమీద వాళ్ళకంత అభిమానం ఏమిటో అర్థంకాక, ఎదురు చెప్పలేక గొణుక్కుని వూరుకున్నడు సాహు ఆ తర్వాత వాళ్ళు లేనప్పుడు గురువారిని ఏమనేవాడు కాదు సాహు ఆ మాత్రానికే గురువారి కళ్ళనిండా వాళ్ళపట్ల భక్తి, గౌరవం అప్పటినించి, వాళ్ళనిచూచి సిగ్గుగా చిరునవ్వు నవ్వుతుండేది. ఆమె మొహంలో ఆ నువ్వు ఆ అమాయకత చూస్తే అందరికి ముచ్చట అన్పించేది - దూరంగా వున్న వాళ్ళచెలెళ్లు గుర్తు వచ్చేవారు.

గురువారీ వచ్చిన నెలరోజులకి ఆ రాత్రి సంఘటన జరిగింది. ఇంట్లో చాకిరీకి రాత్రి పక్కలోకి పనికి వస్తుందని తెచ్చాడు సాహు. ఆ రాత్రి స్టూడెంట్లు కల్పించుకోకపోతే ఏడ్చి గోలపెట్టి ఆఖరికి వాడి బలం ముందు చాలలేక వాడి కోరికకు అంత పసిపిల్ల బలి అయిపోయేది. చేసేదేంలేక ఆ బండవెధవతో జీవితానికి అలవాటుపడివుండేది గరువారి వల్ల వాళ్ళకి తెలియకుండానే గురువారీ బాధ్యత వాళ్ళ నెత్తిన వేసుకొన్నట్లయింది.

సదానంద్ దగ్గిర ఓ రెండు నెలలుంది గురువారి. ఆ తర్వాత ఒక రోజు హాస్టలు గేటుదగ్గిర అందరూ సాయంత్రం షికారు వెళ్ళేసమయానికి తచ్చాడుతూ కనిపించింది. నిరంజన్ కాస్త ఆశ్చర్యంగా ఏం కావాలంటూ అడిగాడు, అడగడమే తడవు అన్నట్టు గురువారీ ఏడుస్తూ తను సదానంద్ దగ్గిరవుండలేనని, తనచేత రోజంతా చచ్చే చాకిరి చేయించుకుని తండన్నా సరిగ్గా పెట్టటం లేదని, అతని భార్య గురువారీని అతి హీనంగాచూస్తూ తిడు తుందని, ఈ తద్దినం నానెత్తిన కెక్కించావు అని భర్తని కేకలేస్తుందని చెప్పి నేనింక అక్కడ వుండలేనని ఏడుస్తూ అంది. యింత తిండిపడేస్తే మీదగ్గిరే ఏదన్నా పనిచేసుకు బ్రతుకుతాను. మీ గదులూడుస్తాను. బట్టలుతుకుతాను, ఏపని చెప్పినా చేస్తాను యింక అక్కడ వుండలేనంటుగోల పెట్టింది.

అందరూ మొహాలు చూచుకున్నారు. యిది యెక్కడి బాదరా బాబూ దాని బ్రతుక్కి మనం జవాబుదారి అన్నట్టు మాట్లాడుతుందేమిటి. నేరకపోయి ఈ గొడవ తగిలించుకున్నాం అన్పించింది అందరికి. తాము కల్పించుకోకపోతే ఏడ్చో మొత్తుకునో ఆ సాహుగాడితోనే వుండేది. తీరికూర్చుని ఈ గొడవ నెత్తిన వేసుకున్నాం అనుకున్నారందరూ.

''మా దగ్గిరేం పని చేస్తావు. మా హాస్టలుకి నిన్ను రానీయరు అంటూ తప్పించుకోబోయారు! గురువారీ కాళ్లు పట్టేసుకుంది. ఏడ్చింది దాని ఏడుపు చూచి జాలనిపించినా, ఏం చెయ్యాలో ఎవరికి అర్థంకాలేదు తలో రూపాయి యిచ్చి ఏదో

పని చేయించుకోవచ్చుగాని ఆడపిల్ల గదుల్లో రావడానికి వార్డెను వప్పుకుంటాడా! తర్వాత ఆలోచించి ఏదో చెప్తాను అప్పటికి వదుల్చుకున్నారు. వార్డెన్‌తో మాట్లాడారు. ''అదెలా కుదురుతుంది ఆడపిల్ల'' అన్నాడు వార్డెను. 'చిన్నపిల్ల దానికేమిటి' అన్నారందరూ. 'చాలు ఆవయస్సు' అన్నాడు వార్డెనునవ్వి కొంటెగా అందరూ నవ్వుకున్నారు.

గురివారి గొడవ ఆఖరికి అందరికి తలనొప్పిగా తయారయింది దాని కంట బడకుండా తప్పించుకున్నారు. కొన్నాళ్ళు 'మాకేం తెలీదు ఫో' అని కసిరారు. రోజూ గురువారీని చూస్తే ఓ పక్క జాలనిపించి ఏం చెయ్యాలో యెవరికి అర్థంకాలేదు.

ఆఖరికి నిరంజన్ ఆలోచించి 'పోనీ దాన్నే ఓ హోటలు పెట్టమందాం' అన్నాడు అందరూ ఆ ఆలోచన ఆమోదించారు. మనిషికి రూపాయి చొప్పున హాస్టలంతా తిరిగి నాలుగొందలు వసూలు చేశారు. ఓ పాక తయారుచేయించి హోటలుకి కావల్సిన సరంజామా కొనిచ్చారు. గరువారీ కృతజ్ఞతతో వాళ్ళకాళ్ళు పట్టేసుకుంది. పన్నెండేళ్ల కుర్రడిని సాయం పెట్టుకుని హోటలు మేనేజ్ చేయడానికి తయారయింది సాహు. సదానంద్ యిచ్చిన తర్ఫీద్ వుండనేవుంది నిరంజన్ గ్రూపుముఖ్యమంది దానికి రెగ్యులర్ కాతాలు ఒక నెల రోజులకే గురువారీ పనిలో నిలదొక్కుకుని రోటీనులో పడింది. దాని గొడవ వదిలిందని అంతా సంతోషించారు.

చూస్తుండగానే రోజులు దొర్లిపోయాయి కాలంతోపాటు గురువారీ కదిలింది. గురువారీ ఇప్పుడు విడవబోయే పసిమొగ్గకాదు. అప్పుడే విడిచిన వికసిత కుసుమం. యవ్వనం యెలాంటి మనిషికైనా అందాన్నస్తుందన్నది ఎంత నిజమో గురువారీని చూస్తే తెలుస్తుంది యవ్వనం కురూపి ఆడదానికైనా వరం గురువారీ కురూపికాదు. ఓ ఛాయ తక్కువన్నమాటే గాని అందమైనదే మరింక ఆకర్షణకి ఏంలోటు? గురువారీ ముఖంలో ఆమాయకత స్థానే చిలిపితనం చోటు చేసుకుంది! ఆ కళ్ళల్లో పూర్వపు పిరికితనం పోయి గడుసుదనం కొంటెతనం వచ్చాయి అందరియెడ ఆమెకివున్న భక్తి. కృతజ్ఞతతోపాటు ఆరాధన చోటుచేసుకుంది. మగాణ్ణి మత్తెకించే విధంగా తయారయింది. గురువారీ వేషంలో, భాషలో అన్నిటా నాజూకు నేర్చింది యిదివరకు లొక్కికి మించి కవ్విస్తూ తయారైంది గురువారీ! వయసే పాఠాలు నేర్పుతుంది. కాబోలు! ఆ కులుకులు, ఆ తలుకులు చూస్తూ 'అమ్మముండ ఎలా తయారందిరా' అనుకుంటూ దాని

హొయలని చూస్తూ ఆనందిస్తున్నారు అందరూ యిప్పుడు వాళ్ళెవరికీ దాన్ని చూస్తే వాళ్ళ చెల్లెల్లు గుర్తురావడంలేదు.

ఒక రోజు రాత్ర మెదటి ఆట సినిమానించితిరిగి వస్తున్నారు కొందరు గురువారీ గుడిసె దగ్గిరికి వచ్చేసరికి వాళ్ళ కాళ్ళు ఆగిపోయాయి. ఈసారి గురువారీ ఏడుపుకాదు - నవ్వు వినిపిస్తూంది.. వాళ్ళ గోలలో కూడా కిలకిల నవ్వే గురువారీ నవ్వు విని అందరూ ఒక క్షణం నిశబ్దంగా నిలబడి పోయారు. ఆ వెంటనే వినవచ్చిన మగ గొంతువి ఆశ్చర్యపోయారు, వాళ్ళ కాళ్ళు వాళ్ళకి తెలియకుండానే ముందుకు వెళ్ళబోయి అంతలోనే ఆగి పోయాయి. ఏడ్చేవాళ్ళకి సాయం, సానుభూతి అవసరంగాని నవ్వేవాళ్ళకి కాదన్నసంగతి ఎవరూ మాట్లాడుకోకపోయిన ప్రతి వాళ్ళకి తట్టింది.

ఆ గొంతు నిరంజన్ పాత్రోది! ఒక్క నిరంజన్‌దేకాదు - ఆతరువాత శరత్ మిశ్రా, సంతోష్ నందా, గోకుల్ సాహు, చటర్జీ వెంకట్రావు వగైరా చాలా గొంతులు వినిపించసాగాయి. ఆ గుడిసెలో, ఒకరోజు మూర్తిదీ వినిపించవచ్చు - ఫరవాలేదు. ప్రక్కనే మెడికల్ కాలేజి హాస్పిటల్ వుందన్న నిబ్బరం వుంది వాళ్ళకి.

మనిషి పెద్దపులికి ఎంత భయపడతాడో. పెద్దపులీ మనిషికి అంతే భయపడ్తుంది. కాని ఒకసారి మనిషి రుచిమరిగిన పెద్దపులి తరువాత 'మాన్ ఈటర్'గా మారుతుంది.

(ఆంధ్రప్రభ వీక్లీ - 1976)